ఇసుక బుకింగ్‌కు విశేష స్పందన

కర్నూలు(అర్బన్), ఆగస్టు 28: ఇసుక పంపిణీ కోసం ఏర్పాటు చేసిన బుకింగ్ సెంటర్లకు విశేష స్పందన వచ్చిందని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గనుల శాఖ కార్యాలయంలో 2,275 టన్నుల ఇసుక కోసం 115 బుకింగ్స్, సి. బెళగల్‌లో 1034 టన్నుల ఇసుక కోసం 80 బుకింగ్స్ వచ్చాయని తెలిపారు. ఇందు కోసం 150 టిప్పర్లు, 45 ట్రాక్టర్లు గురువారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బుకింగ్ చేసుకున్న లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియను సెప్టెంబర్ 11 నుంచి అందుబాటులోకి తెస్తామని తెలిపారు.




పెద్దకడుబూరు మండలం హెచ్. మురవణి జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా తరగతి గదులు

నాడు ఆర్భాటం.. నేడు అవస్థలు



దేవనకొండ మండలం కరివేముల జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తి గదులు



కోసిగి మండలం అర్లబండ జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా వదిలేసిన అదనపు గదులు

- గత వైసీపీ ప్రభుత్వంలో నిష్ప్రయోజనంగా నాడు-నేడు
- ఫేజ్-2 కింద 1,074 పాఠశాలల్లో రూ.521.78 కోట్లతో 1,746 పనులు
- అసంపూర్తిగా అదనపు తరగతి గదులు, ప్రహరీలు
- పాఠశాలలకు అందని సిమెంట్, గ్రీన్ బోర్డులు, ఫర్నీచర్
- విద్యార్థులకు తప్పని అవస్థలు

కర్నూలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంలో ఆర్భాటం తప్ప చేసిందేమీ లేదు. 'నాడు' వైసీపీ పాలకుల నిర్లక్ష్యం.. నిధుల లేమి 'నేడు' బడిలో అడుగు పెట్టిన విద్యార్థులకు శాపంగా మారింది. తరగతి గదులు, ప్రహరీలు, వంట గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు మొండి గోడలుగా కనిపిస్తున్నాయి. పాఠశాల ఆవరణలో నిర్మాణ సామగ్రి పడేయడంతో చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పులపాలయ్యారు. వివిధ పాఠశాలల్లో రూ.521.78 కోట్లతో 1,746 పనులు చేపడితే 52 శాతం కూడా పూర్తి కాలేదు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక నాడు-నేడు పేరును 'మన బడి-మన భవిషత్తు'గా మార్చేసింది. పేరు మార్చేసి సరిపుచ్చుకుంటారా? లేక పనులను పూర్తి చేస్తారా..? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి.

జిల్లాలో జడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలు 1,433 ఉన్నాయి. 2,81,604 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం వివిధ పథకాల పేరిట ఏటా రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నా.. ఇప్పటికీ విద్యార్థులకు సరిపడ వసతులు లేవు. అదనపు తరగతి గదులు, ప్రహరీలు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్.. వంటి సమస్యలు వేధిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం 'నాడు-నేడు' ఆర్భాటంగా చేపట్టింది. జిల్లాలో ఫేజ్-2 కింద 970 పాఠశాలలు, 23 జూనియర్ కళాశాలు, 81 అంగన్‌వాడీ కేంద్రాలు కలిపి 1,074 విద్యాలయాల్లో రూ.521.78 కోట్లతో 457 అదనపు తరగతి గదులు, 367 పాఠశాల ప్రహరీలు, 922 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, వంట గదులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ (పేరెంట్స్ కమిటీ) ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. సకాలంలో నిధులు ఇవ్వకపోవడం, పనులు చేస్తే బిల్లులు రావనే భయంతో పనుల్లో పురోగతి లోపించింది.



హెచ్.మురవణి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎండల్లోనే విద్యార్థుల చదువులు

● అసంపూర్తి నిర్మాణాలు..

గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం నేడు విద్యార్థులకు శాపంగా మారింది. 2021-22 విద్యా సంవత్సరంలో ఫేజ్-2 పనులకు చేపట్టారు. ఏడాది కాలంలో నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంటే నిధులు కొరత వల్ల పురోగతి పడకేసింది. మొదట్లో పేరెంట్స్ కమిటీలు ఆసక్తి చూపలేదు. అయితే.. జిల్లా అధికారులపై అప్పటి ప్రభుత్వం ఒత్తిడి చేయడం.. అధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి పెంచడంతో పేరెంట్స్ కమిటీల పేరిట బినామీ కాంట్రాక్టర్లు ఈ పనులు మొదలు చేపట్టారు. అదనపు తరగతి గదులు, ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, మేజర్, మైనర్ మరమ్మతులు పేరెంట్స్ కమిటీలు చేస్తే.. ఫర్నీచర్, ఫ్యాన్లు, ఆకుపచ్చ (గ్రీన్) బోర్డులు, మరుగుదొడ్లలో బేసిన్లు ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. పేరెంట్స్ కమిటీలు చేయాల్సిన పనులు పలు పాఠశాలల్లో అసంపూర్తిగా ఆగిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 52.38 శాతం పనులు చేశామని అధికారులు చెబుతున్నారు. నందవరం, పత్తికొండ, హొళగుంద, ఆస్పరి, హాలహర్వి, సి. బెళగల్, ఆలూరు, దేవనకొండ వంటి మండలాల్లో 50 శాతం కూడా దాటలేదు. అసంపూర్తి పనులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితమే సిమెంట్ ఇవ్వాలని ప్రతిపాదనలు పంపినా నాటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫర్నీచర్ కూడా రాలేదని తెలుస్తుంది.



ఎమ్మిగనూరు పట్టణం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా తరగతి గదులు

● వాస్తవాలు ఇవీ

ఆదోని పట్టణంలో నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1,986 మంది విద్యార్థులు ఉన్నారు. 34 మంది టీచర్లు పని చేస్తున్నారు. 22 అదనపు తరగతి గదులకు రూ.2.40 కోట్లు మంజూరు చేస్తే.. స్థలం లేదని 16కు తగ్గించారు. నాలుగు గదులు మాత్రం పైకప్పు వేసి వదిలేశారు. రెండో అంతస్తులోని 12 గదులు మొండిగోడలుగా కనిపిస్తున్నాయి. రెండు అంతస్తుల బరువు తట్టుకునే పటుత్వం గ్రౌండ్ ఫ్లోర్ గదుల పునాదులకు, పిల్లర్లకు ఉందా..? అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి. పునాదుల పటుత్వంపై ఎలాంటి పరీక్షలు చేయకుండా నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి. ఫర్నీచర్ కూడా రాలేదు.

● మున్సిపల్ మెయిన్ ఉన్నత పాఠశాలలో 2 వేల వరకు విద్యార్థులు ఉన్నారు. 20 అదనపు తరగతి గదులకు రూ.2.20 కోట్లు మంజూరు చేశారు. ఇక్కడ కూడా వంద ఏళ్ల క్రితం బ్రిటీష్ కాలంలో నిర్మించిన భవనాలపైనే తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. 16 గదులు అసంపూర్తిగా ఆగిపోయాయి.



అసంపూర్తిగా వదిలేసిన పనులు

● కోసిగి మండలం అర్లబండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 413 మంది విద్యార్థులు చదువుతున్నారు. 14 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రస్తుతం మూడు గదులే ఉన్నాయి. ఒక గది స్టాఫ్‌రూం కోసం వాడుకోగా.. 7వ తరగతి ఒక గదిలో, 10వ తరగతి రెండవ గదిలో నిర్వహిస్తున్నారు. 6,8,9 తరగతు విద్యార్థులు వరండాలో, చెట్లు కింద చదువుతున్నారు. ఫేజ్-2 కింద 8 అదనపు తరగతి గదులకు రూ.1.92 కోట్లు మంజూరు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్ 4 గదులు పైకప్పు వేసి వదిలేశారు. దానిపై మరో 4 గదుల నిర్మాణం చేపట్టి మొండి గోడలతో ఆపేశారు. ఫర్నీచరు కూడా రాలేదు. విద్యార్థులు పడుతున్న అవస్థలు ఎన్నో.

● ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 400 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు ఫేజ్-2 కింద 7 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.93 లక్షలు మంజూరు చేశారు. నాలుగు గదుల నిర్మాణం చేపట్టినా అసంపూర్తిగా ఆగిపోయి. రూ.32.26 లక్షలు ఖర్చు చేశారు.

● పెద్దకడుబూరు మండలం హెచ్. మురవణి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 481 మంది విద్యార్థులు ఉన్నారు. 9 అదనపు తరగతి గదులకు రూ.1.19 కోట్లు మంజూరు చేశారు. జీ+1 తరహాలో 8 గదులు నిర్మాణం చేపట్టారు. రూ.80.16 లక్షలు ఖర్చు చేసి అసంపూర్తిగా వదిలేశారు. విద్యార్థులు చెట్ల నీడన ఎండల్లో అవస్థలు పడుతున్నారు.

● దేవనకొండ మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో 450 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో ఉన్న ఆరుగదులు చాలక విద్యార్థులు వరండాలో, చెట్ల కింద చదువుకుంటున్నారు. 8 అదనపు తరగతి గదులు మంజూరు చేసి రూ.కోటి నిధులు ఇచ్చినా నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. తుగ్గలి మండలం పెండేకల్లు గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలలో 252 మంది విద్యార్థులు ఉంటే.. ఇక్కడ రెండు అదనపు గదులు మంజూరు చేశారు. నిర్మాణ పనులు రూఫ్‌లెవల్‌లో ఆగిపోయాయి. జిల్లాలో ఏ పాఠశాలను చూసినా ఇదే పరిస్థితి.

కార్మికులు ఈ-శ్రమ్ కార్డులను తీసుకోవాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



కార్మికుల అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు(లీగల్), ఆగస్టు 28: కార్మికులు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను పొందేందుకు వీలుగా ఈ-శ్రమ్ కార్డును తప్పకుండా తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సూచించారు. అంగన్‌వాడీ కార్మికులు, దుకాణాల కార్మికులకు స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో బుధవారం జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి 3 లక్షలలోపు ఆదాయం ఉండే మహిళలు, కార్మికులు, ఎస్సీ, ఎస్టీలు ఉచిత న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పొందవచ్చన్నారు. ఈ-శ్రమ్ కార్డు ఉంటే.. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం లభిస్తుందని, క్యాన్సర్, బ్రెయిన్ ట్యూమర్ లాంటి వ్యాధులకు కూడా బీమా పథకాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సీ. సాంబశివరావు, సీడీపీవో శారద, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి, నిమజ్జనం
సజావుగా జరిగేలా చూడండి

జాయింట్ కలెక్టర్ బి. నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 28: సెప్టెంబరు 15వ తేదీన నిర్వహించనున్న వినాయక నిమజ్జనం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ బి. నవ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో గణేశ్ ఉత్సవాలపై వివిధ శాఖల అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నవ్య మాట్లాడుతూ సెప్టెంబరు 15న వినాయక నిమజ్జనంలో వివిధ శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనానికి ముందు రోజు నుంచి మద్యం అమ్మకాలు జరగకుండా డ్రైడే పాటించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని, రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహం నిమజ్జనానికి తగినట్టుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. విగ్రహాల నిమజ్జనానికి 8 క్రేన్లను ఏర్పాటు చేసి, ప్రతి క్రేన్‌కు ఇద్దరు డ్రైవర్లు, మెకానిక్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. 6 ఘాట్లు వద్ద లైఫ్ జాకెట్లు, బోట్లు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండే విధంగా మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో మధుసూదన్‌రావు, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, ఆదోని ఆర్డీవో విశ్వనాథ్, గణేష్ ఉత్సవం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కర్నూలు నగర అధ్యక్షుడు డా. మోక్షేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, సుధాకర్, సిటీ జనరల్ సెక్రటరీ జనార్దన్, కోడుమూరు గణేష్ కార్యదర్శి నటరాజ్, నగర సహాయ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో బదిలీలకు 267 దరఖాస్తులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 28: జిల్లాలో పంచాయతీరాజ్ శాఖలో బదిలీల కోసం 267 దరఖాస్తులు వచ్చాయని డీపీవో నాగరాజు నాయుడు తెలిపారు. ఇందులో విస్తరణాధికారులు 16, పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-1)-10, (గ్రేడ్-2)-3, (గ్రేడ్-3)-46, (గ్రేడ్-4)-64, (గ్రేడ్-5)-43, (గ్రేడ్-6)-67 మంది ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. డీపీవో విభాగం నుంచి 19 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని తప్పనిసరి బదిలీలకు అర్హులైన వారు 43 మంది, అభ్యర్థన బదిలీలకు 224 దరఖాస్తులు చేసుకున్నారు.

నేడు మల్లన్నకు స్వర్ణ రథోత్సవం



శ్రీశైలం, ఆగస్టు 28: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని లోకకల్యాణార్థం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. దేవస్థానం వేదిక కమిటీ సూచనతో వేకువజామున స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు జరిపి అనంతరం 7.30 గంటలకు ఆలయ మాడవీధులలో స్వర్ణరథోత్సవం వైభవంగా జరపనున్నారు.

● స్వర్ణ రథోత్సవం ఏర్పాట్లపై సమీక్ష


గురువారం స్వామి, అమ్మవార్లకు జరగనున్న స్వర్ణరథోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రథోత్సవ నిర్వహణకు సంబంధించి ఆయా ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయం, భద్రత, ఇంజనీరింగ్ మొదలైన విభాగాలన్నీ పరస్పర సమన్వయంతో ఉత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, సీనియర్ వేదపండితులు, ఆలయ అధికారులు, స్థానిక సీఐ ప్రసాదరావు పాల్గొన్నారు.


అమ్మ భాషకు గొడుగు

- తెలుగు వ్యవహారిక భాషకు గుర్తింపు తెచ్చిన గిడుగు రామ్మూర్తి
- కైజర్ - ఈ - హిందూ బిరుదును ప్రకటించిన బ్రిటీష్ ప్రభుత్వం
- కళాప్రపూర్ణగా అభివర్ణించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం
- తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర
- నేడు తెలుగు భాషా దినోత్సవం

ఆత్మకూరు, ఆగస్టు 28: ఆదిమ సవర జాతి భాషకు లిపిని, నిఘంటువుని రూపొందించి తెలుగు వాడుక భాషోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్రగా నిలిచిపోయారు. తెలుగు వ్యావహారిక భాషావ్యాప్తికి ఎనలేని కృషి సాగించిన గిడుగు గ్రాంథిక భాషావాదుల పాలిట పిడుగు అన్న ప్రశంసలు అందుకున్నారు. తెలుగు వ్యావహారిక భాషాద్యోమానికి ఆద్యుడైన గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని రాష్ట్ర ప్రజలు మాతృభాషా దినోత్సవంగా పాటిస్తున్నారు. శిష్ట వ్యవహారికం పేరిట వాడుక భాషలో బోధనకు ఆయన పెద్ద పీట వేశారు. శ్రీకాకుళం జిల్లాలోని పర్వతాల పేటలో 1863 ఆగస్టు 29వ తేదిన వీర్రాజు, వెంకమ్మ దంపతులకు గిడుగు జన్మించారు. 1875లో తండ్రి మరణించే వరకు పర్వతాలపేటలో చదువుకున్న ఆయన ఆ తర్వాత విశాఖలోని తన మేనమామ వద్ద వుంటూ ఉన్నత విద్యను పూర్తిచేశాడు. చదువుతున్న రోజుల్లోనే ముఖలింగ దేవాలయం శాసనాలను సొంతంగా చదివి అర్థం చేసుకున్నారు. 1879లో మెట్రిక్యులేషన్ పాసైన తర్వాత ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ.. మిగతా విద్యను కొనసాగించారు. కాగా 1886 నాటికి ఎఫ్ఏ, 1896 నాటికి బీఏ చదివారు. విజయనగరం జిల్లాలోని గణపతి మహారాజు పాఠశాల, కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. తెలుగు భాషా బోధన వ్యావహారికంలో చేయాలన్న ఆయన ఆలోచనకు 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు స్కూళ్ల ఇన్‌స్పెక్టర్‌గా వచ్చిన జేఏ. యేట్స్ అనే ఆంగ్లేయుడి నుంచి మద్దతు లభించింది. అప్పటి ఏవీఎస్ కళాశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస అయ్యంగార్, గురజాడ అప్పారావు, యేట్స్, గిడుగు రామ్మూర్తి పంతులు కలిసి వ్యవహారిక భాషలో బోధనోద్యమానికి శ్రీకారం చుట్టారు. అప్పటికే రామ్మూర్తి వ్యవహారిక భాషలో బోధన కోసం ప్రచారం చేసేవారు. ఇందు కోసం తెలుగు అనే పత్రికను గిడుగు ప్రారంభించారు. ఆయన కృషి కారణంగా 1912-13 సంవత్సరంలో పాఠశాల ఫైనల్ బోర్డు తెలుగు వ్యాస పరీక్షను గద్యంలో లేదా వ్యావహారిక భాషలో రాయవచ్చునని ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి స్కూల్, కళాశాల పాఠ్యపుస్తకాలు వ్యవహారిక భాషలో వెలువడటం మొదలుపెట్టాయి. ఆ తర్వాత ప్రభుత్వం వేసిన ఓ కమిటీలో గ్రాంధికవాదుల ఆధిపత్యం వల్ల వ్యావహారిక భాషలో బోధనలు రద్దు చేసినా.. అనంతర కాలంలో పునరుద్ధరించారు. తెలుగుభాషకు గిడుగు చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకొంటున్నారు. ఉత్తరాంధ్ర అడవుల్లో సవరుల భాషను నేర్చుకుని దానికి లిపిని రూపొందించి అందులో వారికి బోధించారు. సవర భాషకు నిఘంటువును తయారు చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా మద్రాసు ప్రభుత్వం గిడుగుకు రావుబహద్దూర్ బిరుదునిచ్చింది. 1933లో బ్రిటీష్ ప్రభుత్వం కైజర్ - ఈ - హిందూ బిరుదు ఇచ్చింది. 1936లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. . వ్యవహారిక భాషకు ఎనలేని సేవలందించిన గిడుగు రామ్మూర్తి 1940 జనవరి 22న మరణించారు.





తెలుగుభాషకు ఆనాటి ప్రాధాన్యత నేడేదీ?

తెలుగు వ్యావహారిక భాష కోసం గిడుగు రామ్మూర్తి లాంటి ఎందరో మహానుభావులు ఎన్నోన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసినప్పటికీ ప్రపంచీకరణలో మార్పు కారణంగా తెలుగు మాధ్యమంలో కేవలం 25శాతం కన్నా తక్కువే విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వాలు ప్రాథమిక విద్యాస్థాయి నుంచే ఆంగ్ల మాధ్యమంలోనే పాఠశాలలను ఏర్పాటు చేయడంతో తెలుగు భాషకు మరింత నష్టం వాటిల్లింది. 2013లో రాష్ట్ర ప్రభుత్వం తెలుగు సాంస్కృతిక వికాస సంవత్సరంగా గుర్తించి అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖల్లో తెలుగుభాషతోనే పరిపాలన సాగించాలని నిర్ణయించినప్పటికీ అది అమలు కావడం లేదు.

తెలుగు భాషను విస్మరించడం దురదృష్టకరం



నేటి సమాజంలో తెలుగు భాషను విస్మరించడం దురదృష్టకరం. తెలుగు భాషకు నేడు కనీస ఆదరణ లేకపోవడం బాధాకరం. ఇటీవల పలు అధికార ఉత్తర్వుల్లో కూడా తెలుగు భాషలో అచ్చుతప్పులు వస్తున్నాయి.

- విద్యాసాగర్, తెలుగు అధ్యాపకుడు, ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు

గిడుగు కృషి మరువలేనిది



తెలుగు వ్యావహారిక భాషా అభ్యున్నతికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషి అచంచలం. ఒకప్పుడు గ్రాంథిక భాష చాలా మందికి అర్థమయ్యేది కాదు. ఈ ఇబ్బందులను గుర్తించిన గిడుగు రామ్మూర్తి అర్థం లేని భాష వ్యర్థం అన్న నానుడితో తెలుగు వ్యావహారిక భాషాభివృద్ధికి పూనుకున్నారు.

- డాక్టర్ వేమ సుజాత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆత్మకూరు



వడివడిగా అడుగులు

● ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి రవాణా సౌకర్యం, దూరం కి.మీలలో

రవాణ సౌకరం	దూరం కి.మీలలో
నేషనల్ హైవే-40 (కర్నూలు-రాణీపేట)	4
నేషనల్ హైవే-44 (శ్రీనగర్-కన్యాకుమారి)	28
నేషనల్ హైవే-340సీ (కర్నూలు-ప్రకాశం)	26
కర్నూలు రైల్వే స్టేషన్	35
దూపాడు రైల్వే స్టేషన్	30
వెల్దుర్తి రైల్వే స్టేషన్	28
బేతంచర్ల రైల్వే స్టేషన్	28
కర్నూలు విమానాశ్రయం	12
కృష్ణపట్నం పోర్టు	320
కత్తుపట్టి పోర్టు, పొన్నేరి	420
సూరరెడ్డిపాలెం, ఒంగోలు	270
ఐడీసీ తిమ్మాపూర్, రంగారెడ్డి	210



కర్నూలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రగతి కలలు సాకారమయ్యే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఓర్వకల్లును పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని జూలై 23న పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 35 రోజుల కూడా గడవకనే తీపి కబురు అందించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా దేశంలో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందులో ఓర్వకల్లు ఇండిస్ట్రియల్ స్మార్ట్ సిటీ కూడా ఉంది. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తారు. రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పించేలా ప్రాజెక్టు డిజైన్ చేశారు. 45 వేల మందికిపైగా ప్రత్యేక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగాలు లభించనున్నాయి. అలాగే.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో నేషనల్ అనిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం కేంద్రం, వైరల్ వ్యాక్సిన్ ప్రొడక్షన్ యూనిట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కందనవోలు ముగింట పారిశ్రామిక ప్రగతి రెక్కలు విప్పుకోనుంది.

- ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ఓర్వకల్లు
- ఫేజ్-1లో 2,612 ఎకరాల్లో ఏర్పాటు
- ప్రాజెక్టు విలువ రూ.2,786 కోట్లు
- పెట్టుబడులు రూ.12 వేల కోట్లు
- ఆటోమొబైల్, ఫార్మస్యూటికల్స్, వస్త్ర పరిశ్రమలు వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి
- 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- కేంద్ర ప్రభుత్వం ఆమోదం

● చంద్రబాబు విజన్.. మోదీ సహకారం

రాష్ట్ర విభజన తరువాత కొలువుదీరిన అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా పారిశ్రామిక ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించింది. కర్నూలు నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో ఓర్వకల్లు వద్ద సాగుకు పనికిరాని 33 వేల ఎకరాలు గుర్తించి 'ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్'గా ఏర్పాటు చేశారు. ఆసియాలోనే అతి పెద్ద వెయ్యి మెగా వాట్ల సోలార్ యూనిట్ ఏర్పాటు చేశారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ప్రపంచంలోనే తొలి పంప్డ్ స్టోరేజ్ పవర్ ఉత్పత్తి యూనిట్ 3,500 మెగా వాట్లతో ఏర్పాటుకు నాంది పలికారు. వివిధ రంగాల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపాలంటే విమానాయ రవాణా సౌకర్యం ఎంతో కీలకమని గుర్తించి చంద్రబాబు 1,010 ఎకరాల విస్తీర్ణంలో కొండలను పిండి చేసి రూ.110 కోట్లతో కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం నిర్మించారు. నీటి సౌకర్యం కోసం ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి 4 టీఎంసీలు ఎత్తిపోసి నిల్వ చేసేందుకు జలాశయం నిర్మాణం, కర్నూలు రైల్వే స్టేషన్ సమీపంలోని దూపాడు రైల్వే స్టేషన్ నుంచి రైల్వేలైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నందికొట్కూరు దగ్గర మెగా సీడ్ హబ్, జైన్ ఇరిగేషన్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అన్ని సవ్యంగా జరిగి ఉంటే ఇప్పటికే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ కేంద్రంగా పలు పరిశ్రమలు స్థాపించి కార్మికులు, ఉత్పత్తులతో కళకళలాడేది. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పడకేసింది. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు మహర్దశ వచ్చింది.





2,612 ఎకరాలు.. రూ.2,786 కోట్లతో అభివృద్ధి

సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. నవ్యాంధ్ర ప్రగతి కోసం వివిధ అభివృద్ధి పనులు సహా పారిశ్రామిక ప్రగతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని విన్నవించారు. జూలై 23న హైదరాబాదు-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా 'ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్' అభివృద్ధి చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంగా వెల్లడించారు. 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా 'ఫేజ్-1 కింద 2,621 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ నిధులతో నీరు, రోడ్లు, రవాణా, విద్యుత్.. వంటి మౌలిక సౌకర్యాలు కల్పిస్తారు. నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం విడి భాగాలు తయారి, పునరుత్పాదక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హార్డ్ వేర్, ఫార్మాస్యూటికల్స్, వజ్రాలు, బంగారు ఆభరణాల తయారీ, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటు చేసేందుకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ప్రత్యేక దృష్టిని పెట్టింది. ఆయా పరిశ్రమలు ఏర్పాటు కోసం రూ.12 వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని, తద్వారా 45,071 మంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు.

● బనవాసిలో ఎన్ఏడీసీపీ సెంటర్!

జాతీయ పశు ఆరోగ్యం, వ్యాధి నియంత్రణ కార్యక్రమం (ఎన్ఏడీసీపీ)లో భాగంగా ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో వ్యాక్సిన్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ కేంద్రం హైదరాబాదులో ఉంది. రాష్ట్ర విభజన తరువాత ఏపీలో ఎక్కడా ఏర్పాటు చేయలేదు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో నిర్వహించే ఎన్ఏడీసీపీ కేంద్రం బనవాసిలో ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. ఈ పశుక్షేత్రంలో పశుసంవర్ధక శాఖకు సుమారు మూడు వేల ఎకరాకలకు పైగా భూమి ఉంది. ఎన్ఏడీసీపీకి 100-150 ఎకరాలు అవసరం. అలాగే.. దేశంలో మూడు మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందులో ఒకటి బనవాసి పశు క్షేత్రంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కోరుతోంది.

● ఉమ్మడి జిల్లాలో 10 ఎఫ్ఎం చానల్స్

దేశవ్యాప్తంగా 234 నగరాలు, పట్టణాల్లో 730 ఎఫ్ఎం రేడియో కేంద్రాల ఏర్పాటుకు బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అందులో ఉమ్మడి జిల్లాలో ఆదోనిలో 3, కర్నూలులో 4, నంద్యాలలో 3 కలిపి 10 ఉన్నాయి. ఈ చానల్స్ ఏర్పాటు వల్ల మాతృభాషా అభివృద్ధి సహా యువతకు కొత్తగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.



హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సంస్థకు వినియోగదారుల కమిషన్ మొట్టికాయ

కర్నూలు(లీగల్), ఆగస్టు 28: మృతి చెందిన తర్వాత బీమా మొత్తం చెల్లిస్తామని హామీ ఇచ్చి.. తీరా మృతి చెందిన పిదప తగిన కారణాలు చెప్పకుండా బీమా మొత్తం చెల్లించేందుకు తిరస్కరించిన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో మొట్టికాయ వేసింది. ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ గ్రామానికి చెందిన కే. శ్రీనివాసులు నాయుడు 2018లో రూ.15 లక్షలకు, 2021జూన్‌లో రూ.18.78లక్షలకు వేర్వేరుగా రెండు బీమా పాలసీని తీసుకున్నాడు. ఆ తర్వాత అతను 2022 సెప్టెంబరు నెలలో గుండెపోటుతో మృతి చెందాడు. బీమా సొమ్ము కోసం మృతుడి భార్య ఇన్సూరెన్స్ సంస్థకు దరఖాస్తు చేసుకుంది. 2018లో తీసుకున్న పాలసీపై ఉన్న మొత్తాన్ని హెచ్‌డీఎఫ్‌సీ సంస్థ చెల్లించింది. అయితే.. 2021లో తీసుకున్న పాలసీ మొత్తాన్ని ఇవ్వడానికి సంస్థ నిరాకరించింది. దీనిపై హెచ్‌డీఎఫ్‌సీ వివరణ ఇస్తూ రెండో పాలసీని తీసుకోవడానికి ముందే మృతుడు స్థానిక ఒక ప్రైవేటు వైద్యశాలలో గుండె వ్యాధికి చికిత్సలు తీసుకున్నాడని, ఈ విషయాన్ని మరుగుపరిచి రెండో పాలసీని తీసుకున్నందుకు ఆ పాలసీని తిరస్కరిస్తున్నట్లు సంస్థ తెలిపింది. కేసును విచారించిన జిల్లా వినియోగదారుల కమిషన్ రెండో పాలసీపై మొత్తాన్ని చెల్లించకపోవడం సేవాలోపం అవుతుందని మృతుడు చికిత్స తీసుకున్నట్లు సాక్ష్యాధారాలను చూపకుండా తిరస్కరించడం సేవాలోపం అవుతుందని నిర్ధారించింది. దీంతో రెండో పాలసీ మొత్తం రూ.19 లక్షలను 9 శాతం వడ్డీతో పాటు కోర్టు ఖర్చుల కింద అదనంగా మరో రూ.30వేలను ఫిర్యాదికి చెల్లించాలని ఆదేశిస్తూ కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్. నారాయణ రెడ్డి, నజీమా కౌసర్లు తమ తీర్పులో పేర్కొన్నారు.

పెద్దాసుపత్రికి విరాళంగా ఫ్యాన్లు

● కాలిఫోర్నియాకు చెందిన ఎన్ఆర్ఐ చేయూత

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 28: కర్నూలు మెడికల్ కాలేజీ గ్రాడ్యుయేట్స్ ట్రస్టు హైదరాబాదు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు 25 ఫ్యాన్లు విరాళంగా అందించింది. కర్నూలు మెడికల్ కాలేజీ 1962 బ్యాచ్‌కు చెందిన కోవెలకుంట్ల నివాసి డా. విశ్వనాథరెడ్డి అమెరికా చికాగోలో పని చేసి కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. ఆసుపత్రికి క్రాంప్టన్ హై స్కిడ్ 1200 ఎంఎం 25 ఫ్యాన్లను విరాళంగా ఇచ్చిన డా.విశ్వనాథరెడ్డిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు 25 ఫ్యాన్లను కేఎంసీ గ్రాడ్యుయేట్ల ట్రస్ట్ సెక్రటరీ డా.రామలింగారెడ్డి ద్వారా ట్రస్టు సభ్యులు గౌరి గోపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డా. శివశంకర్ రెడ్డి సూపరింటెండెంట్‌కు అందించారు.



ఎన్ఆర్ఐ విరాళంగా ఇచ్చిన ఫ్యాన్లను సూపరింటెండెంట్‌కు అందిస్తున్న రిటైర్డు డీఎంహెచ్‌వో డా.శివశంకర్ రెడ్డి

శ్రీరాముని నూతన రథానికి శ్రీకారం

రూ.12.50 లక్షలు వెచ్చించనున్న తుగ్గలి నాగేంద్ర

అడ్వాన్స్‌గా రూ.5 లక్షల అందజేత



తుగ్గలిలో శ్రీరాముని నూతన రథానికి అడ్వాన్సు ఇస్తున్న తుగ్గలి నాగేంద్ర దంపతులు

తుగ్గలి, ఆగస్టు 28: శ్రీరామునికి నూతన రథం చేయించడానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి ముందుకు వచ్చారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలి శ్రీరాముల ఆలయంలో నూతన రథాన్ని రూ.12.50 లక్షలతో చేయిస్తున్నారు. ఈ మొత్తాన్ని తుగ్గలి నాగేంద్ర దంపతులు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా రథం తయారు చేసే వారికి రూ.5 లక్షలు నగదును అడ్వాన్సుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాముల దేవాలయ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రతి పేదవాడికి చేదోడుగా ఉంటూ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని అన్నారు. వచ్చే శ్రీరామనవమి వేడుకలకు నూతన రథం సిద్ధం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లాబకాష్, ఆకుల శీనప్ప, సర్పంచులు రవి, మాజీ వైస్ ఎంపీపీ విజయభాస్కర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా వసూలు చేస్తే లైసెన్సులు రద్దు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 28: కొంత మంది కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారని, అలాంటి వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని యార్డులోని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విక్రయానికి తెచ్చిన పంట ఉత్పత్తులపై రైతుల నుంచి ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయన్నారు. వేరుశనగ తదితర పంట ఉత్పత్తులకు ఒక కుప్పకు రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నట్లు తెలియడంతో కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు రైతుల నుంచి చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఏ పంట సరుకుకు ఎంత కమిషన్ తీసుకోవాలో పేర్కొంటూ పట్టికను మార్కెట్ యార్డు అంతటా ఏర్పాటు చేశారు.

ఆర్ఐవో అవినీతిపై విచారణ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 28: కర్నూలు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో గురువయ్య శెట్టిపై వచ్చిన ఆరోపణలపై ఇంటర్మీడియట్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సుబ్బారావు బుధవారం విచారణ చేపట్టారు. పబ్లిక్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్, ట్రాన్స్‌పోర్టు నిధులు దుర్వినియోగం, ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలో ప్రైవేటు కళాశాల యాజమాన్యాలతో కుమ్మక్కై. ఆర్ఐవో గురువయ్య శెట్టి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణ చేపట్టారు. డీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు మహేంద్రబాబు, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం నాయకులు సుంకన్న, అధ్యాపకుల సంఘం నాయకులతో పాటు కార్యాలయంలోని అధికారులు, సిబ్బందిని వేర్వేరుగా విచారణ చేపట్టారు. విచారణ జరుగుతున్న సమయంలో డీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆర్ఐవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆర్ఐవో గురువయ్యశెట్టిపై వచ్చిన అవినీతిని నిక్కచ్చిగా నిగ్గు తేల్చి సస్పెండ్ చేయాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మహేంద్ర నాయుడు డిమాండ్ చేశారు.

రైలు కింద పడి ప్రేమ జంట ఆత్మహత్య

మద్దికెర, ఆగస్టు 28: రైలు కింద పడి ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కర్నూలు జిల్లా మద్దికెరలో బుధవారం చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ప్రతాప్‌సింగ్, ఉమా దంపతులు కొన్నేళ్ల కిందట గుంతకల్లు పట్టణానికి వచ్చి పానీ పూరి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే మధ్యప్రదేశ్‌లోని మెహతాన్‌పురం గ్రామానికి చెందిన కులదీప్ పరియార్ (22) అనే యువకుడిని ఇక్కడికి తీసుకొచ్చి పానీ పూరి బండి దగ్గర పని చేయడానికి పెట్టుకున్నారు. కులదీప్ పరియార్ ఏడేళ్ల నుంచి ప్రతాప్ సింగ్ వద్దే పని చేస్తూ వచ్చాడు. అయితే డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రతాప్‌సింగ్ కూతురు మీనా.. కులదీప్ పరియార్ ప్రేమలో పడింది. విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో కులదీప్ పరియార్‌ను మందలించారు. దీంతో ప్రతాప్‌సింగ్ వద్ద పనిమానేసి గుంతకల్లు పట్టణంలో కసా పురం వెళ్లే దారిలో కులదీప్ పరియార్ సొంతంగా పానీపూరి వ్యాపారం పెట్టుకు న్నాడు. అయినప్పటికీ వీరి ప్రేమ అలాగే కొనసాగుతూ వచ్చింది. ఈ నెల 27న ఇద్దరు వారి పెద్దలకు చెప్పకుండా పారి పోయారు. దీంతో యువతి తల్లిదండ్రులు కసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఆ ప్రేమజంట మద్దికెర సమీపంలో బుధవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. అయితే.. తమ చావుకు ఎవరూ కారణం కాదని, హిందీ, ఇంగ్లీషు భాషలో ఉత్తరం రాసి అక్కడే పెట్టి ఆత్మహత్య చేసుకున్నారు. గుంతకల్లు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కులదీప్ పరియార్, మీనా (ఫైల్)

నగర పాలక సంస్థ కమిషనర్‌గా పీవీవీఎస్ మూర్తి?

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 28: నగర పాలక సంస్థ కమిషనర్‌గా పీవీవీఎస్ మూర్తిని ప్రభుత్వం నియమించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో ఇక్కడే పని చేసిన అనుభవం ఉండటంతో కమిషనర్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన అనంతపురంలోని రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నెల క్రితం రవీంద్రబాబును నియమిస్తారని అనుకున్నారు. అయితే నాన్ ఐఏఎస్‌లు వద్దని ప్రకాశం జిల్లా కందుకూరు సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్న విద్యాధరిని ప్రభుత్వం నియమించింది. అయితే అనివార్య కారణాలతో రెండు రోజుల క్రితం విద్యాధరిని చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. ఈ క్రమంలో మళ్లీ రవీంద్రబాబు పేరు వినిపిస్తోంది. అయితే రవీంద్రబాబు మీద పలు ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఆయన రాకను మహిళలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పీవీవీఎస్ మూర్తి పేరు దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తోంది.

బాలికపై అత్యాచార యత్నం

హొళగుంద, ఆగస్టు 28 : హొళగుంద మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన నాగేష్ అనే వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఎస్సై బాల నరసింహులు తెలిపారు. బాలిక మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో తన ఇంటికి కొద్ది దూరంలోని కిరాణ దుకాణానికి వెళ్తుండగా అక్కడే ఉన్న నాగేష్ అనే వ్యక్తి చెయ్యి పట్టుకున్నాడు. మరో చేత్తో నోరు మూసి నిర్మాణ దశలో ఉన్న ఇంటిలోకి ఎత్తుకెళ్లాడు. అత్యాచారానికి పాల్పడుతుండగా బాలిక గట్టిగ కేకలు వేసింది. దీంతో నిందితుడు భయంతో అక్కడే బాలికను వదిలి పారిపోయాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

డోన్(రూరల్), ఆగస్టు 28: పట్టణంలోని కర్నూలు రైల్వే గేట్ల సమీపంలో తెల్లవారుజామున గుర్తు తెలియని రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన చాకలి గాలెన్న (42) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్యతో పాటు కొడుకు, కూతురు ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు సదరం సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందుకున్న ట్రాన్స్‌జెండర్లతో సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 28: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ట్రాన్స్‌జెండర్స్ సదరం సర్టిఫికెట్ల కోసం 8 మంది పాల్గొన్నారు. అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు యురాలజీ, ఎండోక్రైనాలజీ, సైక్రియాట్రిక్ విభాగాలకు చెందిన వైద్యులు పరిశీలించి అర్హులైన ఐదుగురు ట్రాన్స్‌జెండర్లకు సదరం సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఈ మేరకు సర్టిఫికెట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి, సదరం క్యాంపు ఇన్‌చార్జి షెహనాజ్ బేగం, ఉద్యోగి అనిల్ కుమార్, ట్రాన్స్‌జెండర్ కోఆర్డినేటర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 28: గణేష్‌నగర్‌లో మైనార్టీ సంక్షేమ పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లా విమర్శించారు. బుధవారం ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్ కన్నాకు వినతి పత్రం ఇవ్వడానికి వెళితే.. ఆయన మధ్యాహ్నం 12 గంటలైనా కార్యాలయంలో లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వారు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ హాస్టల్‌లో పురుగుల అన్నం తిని అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. తాగేందుకు, ఉపయోగానికి నీరు లేక, ఉన్న నీటిలో పురుగులు, కీటకాలు రావడం వల్ల ఆ కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి, ఉపాధ్యక్షుడు అబుబకార్ సాయి కార్యదర్శి మల్లేష్, అర్యన్ హాస్టల్ విద్యార్థులు పాల్గొల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు నేడు కౌన్సెలింగ్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 28: ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-5), డిజిటల్ అసిస్టెంట్లు (గ్రేడ్-6) బదిలీలకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీపీవో నాగరాజు నాయుడు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు జిల్లా పరిషత్‌లోని మీటింగు హాలు వద్ద హాజరు కావాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు.

పీఆర్ పీఐయూ డీఏవోగా అర్జున్ నాయక్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 28: పంచాయతీరాజ్ శాఖ పీఐయూ కర్నూలు డివిజన్ కార్యాలయంలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా (డీఏవో)గా అర్జున్ నాయక్ ఇన్‌చార్జిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీఏవోకు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఇరిగేషన్ శాఖలో పని చేస్తున్న అర్జున్ నాయక్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సీఐని కలిసిన టీడీపీ నాయకుడు

ఓర్వకల్లు, ఆగస్టు 28: కర్నూలు రూరల్ సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సీఐ చంద్రబాబు నాయుడును బుధవారం మండలంలోని లొద్దిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు రాజశేఖర్ కలిశారు. అనంతరం ఆయనకు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే గౌరు చరితకు సీఐటీయూ నాయకుల వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కల్లూరు, ఆగస్టు 28: భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం అందజేశారు. సంఘం నగర అధ్యక్షుడు సుధాకరప్ప మాట్లాడుతూ ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం బిల్డింగ్ వర్కర్స్ నిధులు ఇతర సంక్షేమ పథకాలకు వాడుకుని రూ.925 కోట్లు దారి మళ్లించిందని ఆరోపించారు. ఎమ్మెల్యే స్పందించి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యేకు వినతి ఇచ్చిన వారిలో నరసింహులు, రాధాకృష్ణ, జి.ఏసు, అబ్దుల్ రహమాన్, శ్రీనివాసులు, మౌలాలి ఉన్నారు.

విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్



మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 28: విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే విద్యుత్ అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్‌దేశాయ్ అన్నారు. విద్యుత్ సంస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారా 2000 సంవత్సరంలో విద్యుత్ పోరాటంలో అమరులైన రామక్రిష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిలకు బుధవారం సుందరయ్య భవన్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా డి. గౌస్‌దేశాయ్ 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటం సందర్భంగా బషీర్‌బాగ్‌లో ఆనాటి టీడీపీ ప్రభుత్వంలో జరిగిన పోలీసు కాల్పుల్లో ముగ్గురు అమరులయ్యారని గుర్తు చేశారు. విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

‘ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటాం’



కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

ఓర్వకల్లు, ఆగస్టు 28: మండలంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ఓర్వకల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రాంభూపాల్ రెడ్డి, గోవింద రెడ్డి ఫిర్యాదు మేరకు బుధవారం ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను తహసీల్దార్ పరిశీలించారు. ఓర్వకల్లు బాలికల వసతి గృహం సమీపాన గల సర్వే నెంబర్.202లో 2ఎకరాల 75 సెంట్ల భూమి ఉందని, అందులో రూ.కోటి విలువ చేసే ఎకరా ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకుడు శంకర్ రెడ్డి ఆక్రమించారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో ఆ భూమిని తహసీల్దార్ వెంకటరమణ, సర్వేయర్ జయరాముడు, వీఆర్వో కృష్ణదేవరాయలు పరిశీలించారు. అధికారులు ఆక్రమణ గోడలను తొలగించేందుకు వీఆర్‌వోలు ఎక్స్‌కవేటర్లను తీసుకెళ్లారు. ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వరమ్మ భర్త శంకర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా గోడలను తొలగిస్తారని అధికారులను నిలదీశారు. తమ భూమిని కొలతలు వేసి చూపించి అందులో ప్రభుత్వ భూమి ఉందని తెలిస్తే.. వాటిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని తేల్చి చెప్పారు. గోడలను తొలగించేందుకు అధికారులు విశ్వప్రయత్నం చేసినా భూ ఆక్రమణలకు పాల్పడిన నాగేశ్వరమ్మ, శంకర్ రెడ్డి అడ్డుపడి ఎలా తొలగిస్తారని ఎదురు తిరగడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లారు. ఈ విషయంపై పూర్తి స్థాయి సర్వే చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు.

గురుకులాల్లో పార్ట్ టైమ్ టీచర్ల దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 28 : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలో పార్ట్‌టైమ్ టీచరుగా విభిన్న స్థాయిలో జేఎల్, పీజీటీ, టీజీటీలుగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయకర్త డా.ఐ. శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్-05 (మ్యాథ్స్-02, ఫిజిక్స్-02, హిస్టరీ-01), పీజీటీ-01 (మ్యాథ్స్-01), టీజీటీ-03 (బయో సైన్స్-1, ఫిజికల్ సైన్స్-01, టీజీటీ మ్యాథ్స్-01) బాలికల పాఠశాలలో గల ఖాళీలకు స్త్రీలకు మాత్రమే కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 08518-295601 ను సంప్రదించాలన్నారు.

మంచి అలవాట్లు నేర్చుకోవాలి: ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సమీఉద్దీన్

కర్నూలు(అర్బన్), ఆగస్టు 28: విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్ సమీఉద్దీన్ అన్నారు. బుధవారం నగరంలోని ఉస్మానియా కళాశాలలో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏపీ శాక్స్ ఆదేశాల మేరకు విద్యార్థులను ఎయిడ్స్ ఇతర దురలవాట్లకు బానిసలు కాకుండా చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అబిద్ అలీ, ఒబేదుల్లాహ్, షరీఫ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కౌతాళం తహసీల్దార్‌పై కేసు నమోదు చేయాలి



జేసీకి వినతి పత్రం ఇస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 28: తప్పుడు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన కౌతాళం తహసీల్దార్ మల్లికార్జున స్వామిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. బుధవారం జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ ఎస్సీ కులానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నల్లగొడ్డి శ్రీనివాసులు ఆదోనిలోని ఆది ఆంధ్ర పురపాలక ప్రాథమిక పాఠశాల సదాపురంలో ఎస్జీటీ టీచర్‌గా పని చేస్తూ తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం చేస్తున్నందుకు అధికారులు సస్పెండ్ చేశారు. విచారణ నిమిత్తం నల్లగొడ్డి శ్రీనివాసులును కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలని అధికారులు ఆదేశించారు. కౌతాళం మండలం బదినేహాల్ గ్రామంలో నివాసం లేకున్నా తప్పుడు పత్రాలు సమర్పించిన ఎస్సీ కులానికి చెందిన ఈయనకు స్థానిక రెవెన్యూ అధికారుల అండదండలతో కాసులకు కక్కుర్తి పడి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన తహసీల్దార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మధుకృష్ణ, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, ఎస్సీ, ఎస్టీ నాయకులు రాజీవ్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధిపై ప్రణాళిక సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్యామల

సి.బెళగల్, ఆగస్టు 28: మండల అభివృద్ధిపై ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రత్యేక అధికారి శ్యామల మండల స్థాయి అధికారులకు ఆదేశిం చారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాముడు అధ్యక్షతన అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్యామల మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో సీసీరోడ్లు, మురుగుకాలువలు, తాగునీరు. వీధి దీపాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రతి ఇంటికి కొళాయి, విద్య, వైద్యం పాఠశాలలో అన్ని సౌకర్యాలను ఉండేలా చూడాలన్నారు.

సచివాలయ ఏఎన్ఎంలకు బదిలీ నుంచి మినహాయింపు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 28: గ్రామ సచివాలయంలో పని చేస్తున్న ఏఎన్ఎంలకు సీజనల్ వ్యాధుల నేపథ్యంతో సాధారణ బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చినట్లు డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ వెల్లడించారు. సీజనల్ వ్యాధులతో పాటు జ్వరాలు ఎక్కువగా నమోదవుతుండటంతో బదిలీల నుంచి మినహాయింపు ఇస్తూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు.

అర్చకులకు టీడీపీతోనే న్యాయం

కర్నూలు(అర్బన్), ఆగస్టు 28: టీడీపీ ప్రభుత్వమే బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటరామరాజు అన్నారు. బుధవారం నగరం లోని ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ అర్చకుల వేతనాలు రూ.5 వేల నుంచి రూ. 10 వేలు, రూ.10 వేల నుంచి రూ.15 వేలు పెంచడం, ప్రతి దేవాలయంలో ఒక బ్రాహ్మణ బంధువుని పాలక మండలి సభ్యునిగా నియమించడం వంటివి టీడీపీ ప్రభుత్వం మాత్రమే చేయగలదని అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 28: మున్సిపల్ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకటరెడ్డి కోరారు. బుధవారం మున్సిపల్ జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. టి.వెంకటరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ విద్యా వ్యవస్థను నాశనం చేస్తే 84 జీవోను రద్దు చేయాలని, వర్క్ అడ్జెస్ట్‌మెంట్ అసంబద్ధతలను తొలగించాలని కోరారు. మున్సిపల్ జేఏసీ సంఘం ఛైర్మన్ ఇబ్రహీం, శ్రీరాముడు, జనరల్ సెక్రటరీ ఎస్.రాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి: సీఐ

ఓర్వకల్లు, ఆగస్టు 28: గణేశ్ ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా వారి వివరాలు ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌లో తెలిపి, వారి గుర్తింపు కార్డులు, నకలు కాపీలను జత చేయాలన్నారు. వినాయక మండపాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసే స్థలంలో నిర్వాహకులతో అనుమతి తీసుకోవాలన్నారు. ఎస్ఐ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

తిక్కారెడ్డి కూతురి వివాహానికి ప్రముఖులు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 28: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి కూతురి వివాహానికి అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు. బుధవారం నగర శివారులోని వీజేఆర్ ఫంక్షన్ హాలులో తిక్కారెడ్డి కూతురు ప్రభావతి, హైదరాబాద్‌కు చెందిన ప్రమోద్ రెడ్డి వివాహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్పీ బిందు మాధవ్, కేఈ క్రిష్ణమూర్తి, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దంపతులు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యామ్ బాబు, బోగ్గుల దస్తగిరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు తదితరులు హాజయ్యారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించాలి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 28: మయూరి గ్రీన్ ల్యాండ్స్ కాలనీలో ప్రభుత్వ స్థలంలో నిర్మించినటువంటి షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించాలని కోరుతూ బుధవారం మయూరి గ్రీన్ ల్యాండ్స్ కాలనీవాసులు కలెక్టరేట్‌లోని ఏవో రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు.

అర్చకుల వేతనాల పెంపుపై హర్షం

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 28: అర్చకుల వేతనాలను పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం (ఏబీబీఎం) జిల్లా అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అర్చకులకు ఇచ్చే రూ.10 వేల వేతనాన్ని రూ.15 వేలకు పెంచుతూ సీఎం చంద్రబాబు నిర్ణయించటం అభినందనీయమన్నారు.

టీజీవీ కళాక్షేత్రంలో నేడు తెలుగు భాషా దినోత్సవం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 28: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో గురువారం సాయంత్రం 6 గంటలకు తెలుగు భాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈవేడుకలకు సభాధ్యక్షుడిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరవుతారని, ముఖ్య అతిథులుగా కర్నూలు ఎంపీ నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి హాజరవుతారని తెలిపారు.

పారిశుధ్యం మెరుగు పర్చాలి



ఆర్టీసీ ఆర్ఎంకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(రూరల్), ఆగస్టు 28: కర్నూలు కొత్తబస్టాండ్‌లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, సీవీ వర్మ, టి.మద్దిలేటి డిమాండ్ చేశారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కర్నూలు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసులును కలిసి వారు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు కొత్తబస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను సక్రమంగా శుభ్రం చేయకపోవడం వలన బస్టాండ్ పరిసర ప్రాంతంలో దుర్వాసన వస్తోందని అన్నారు. తద్వారా బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. మరికొన్ని చోట్ల మూత్రశాలలు, మరుగుదొడ్లు శిథిలా వస్థకు చేరాయని, చెత్తాచెదారం పేరుకుపోయాయని అన్నారు. ఆర్ఎంను కలిసిన వారిలో శ్రీనివాసరెడ్డి, గోపినాథ్, షాకిర్, జయప్రకాష్‌రెడ్డి, షంషుద్దీన్ ఉన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



చెత్త వేయకండి అనే బోర్డును ఏర్పాటు చేస్తున్న కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 28: నగరంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యవంతులుగా ఉంటారని 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి అన్నారు. బుధవారం వార్డు పరిధిలోని ఎస్ఏఆర్ కాలనీలో చెత్త వేయకండి..అంటూ ఒక బోర్డును ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా విక్రమసింహారెడ్డి మాట్లాడుతూ పరిసరాలు బాగుంటే పిల్లలు, కుటుంబాలు బాగుంటాయనే నినాదంతో ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేశామన్నారు.

పీహెచ్‌సీల్లో భద్రత పెంచాలి

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 28: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రి పూట స్టాఫ్ నర్సులు విధులు నిర్వహించడం కష్టంగా ఉందని, తక్షణమే ప్రతి పీహెచ్‌సీకి సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కోరింది. బుధవారం సాయంత్రం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు, డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో ఉన్న సీనియర్ ఏఎన్ఎంలకు 12 సంవత్సరాల ఇంక్రిమెంటు ఇవ్వాలని డీఎంహెచ్‌వోను కోరారు. యూనియన్ కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.మాధవరాజు, సి.బంగారి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్, కోశాధికారి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

కల్లూరు, ఆగస్టు 28: మండలంలోని ఉలిందకొండ గ్రామంలో కృష్ణాష్టమి ముగింపు సందర్భంగా బుధవారం శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో లక్కీ2 గోపి యాదవ్, టీడీపీ సీనియర్ నాయకుడు ఈవీ రమణ, శ్రీకాంత్, వెంకటరమణ. మహేంద్ర, విక్రమ్, నారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు అభినందన

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 28: స్థానిక డీఎస్ఏ స్టేడియంలో జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని చేపట్టిన అంతర్ పాఠశాలల కబడ్డీ పోటీలు బుధవారం ముగిసాయి. బాలికల విభాగంలో జీన్ నారాయణ, టంగుటూరి ప్రకాశం పంతులు మున్సిపల్ హైస్కూల్ జట్టు, బాలుర విభాగంలో ఇండస్, కృష్ణానగర్ కేశవరెడ్డి, నారాయణ పాఠశాలల జట్టు విజేతలుగా నిలిచాయి. ఈ సందర్భంగా బుధవారం విజేతలుగా నిలిచిన జట్లకు ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడ్డి హాజరై అభినందనలు తెలియజేశారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు, ఆగస్టు 28: నాలుగో పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న జేఆర్ నాయుడు డీలక్స్ లాడ్జిలో అశోక్ (25) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా వడ్డెపల్లి మండలానికి చెందిన అశోక్ ఇంటర్‌లో చదువు మానేసి చెన్నైలో కొంత కాలం బేకరీలో పని చేశాడు. ఏడాది నుంచి ఇంటి వద్దే ఉంటూ నిర్మాణం పనులు చేస్తున్నాడు. ఇటీవల కాలంలో శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో పని చేసే ఓ కానిస్టేబుల్ కూతురును ప్రేమించాడు. ఆమెకు ఏడాది క్రితం మరొకరితో నిశ్చితార్థం కావడంతో మనస్తాపానికి గురైన అశోక్ ఈ నెల 24న తన మిత్రుడు నవీన్‌తో కలిసి కర్నూలు వచ్చాడు. మంగళవారం రాత్రి నవీన్ భోజనం కోసం బయటకు వెళ్లగా.. అశోక్ తన రూములో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నవీన్ గది వద్దకు వచ్చి లాడ్జీ నిర్వాహకుల సాయంతో తలుపులు పగులకొట్టి అశోక్‌ను బయటకు తీసుకువచ్చాడు. వెంటనే ఆటోలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకు రాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో నెక్లెస్ అపహరణ

కర్నూలు, ఆగస్టు 28: నాలుగో పోలీస్‌స్టేషన్ పరిధిలో బస్టాండులో ఆర్టీసీ బస్సులో బంగారు నెక్లెస్ అపహరణకు గురైంది. పత్తికొండ మండలానికి చెందిన నాగరాజు డోర్నాలలో ఎస్బీఐలో ఉద్యోగి. మంగళవారం సొంతూరు వచ్చి తిరిగి బుధవారం డోర్నాలకు వెళ్తున్నాడు. పత్తికొండ నుంచి కర్నూలు వచ్చి ఆర్టీసీ బస్టాండులో దిగాడు. డోర్నాల వెళ్లేందుకు మరో బస్సు ఎక్కాడు. బస్సు కదిలి కొంత దూరం బస్టాండులో ఉండగానే అతని దగ్గర బ్యాగులో ఉన్న నెక్లెస్ బాక్సు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వెంటనే అప్రమత్తమై పోలీసులను ఆశ్రయించాడు. నాలుగో పట్టణ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కేసీలో గుర్తు తెలియని మృతదేహం

కర్నూలు, ఆగస్టు 28: మూడో పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసీ కెనాల్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక వినాయక ఘాట్ సమీపంలో కేసీలో మృతదేహం కొట్టుకుపోతుండగా.. స్థానికులు గుర్తించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు కేసీ కెనాల్‌కు చేరుకుని గణేష్ నగర్ సమీపంలో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని వయస్సు 40 ఏళ్ల పైబడి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించారు. మృతుని వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కర్నూలు, ఆగస్టు 28: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తబస్టాండు వెనుక ఉన్న ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. గోనెగండ్లకు చెందిన ఓ ఇద్దరు, కర్నూలు చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.2లక్షలపైగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వారిని స్టేషన్‌కు తర లించి పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన జగదీష్

కోడుమూరు(రూరల్), ఆగస్టు 28: మండలంలోని ప్యాలకుర్తి-కొత్తూరు గ్రామాల మధ్య బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ప్యాలకుర్తి దాటాక మిట్ట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో బైక్ వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నుజ్జు అయింది. మృతుడు కోడుమూరు వాసి జగదీష్ (31)గా గుర్తించారు. జగదీష్ కర్నూలులో గుత్తి పెట్రోలు బంకు సమీపాన షాప్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది. అటుగా వెళ్తున్న వారు సమాచారం అందించడంతో పోలీసులు చేరుకుని మృతదేహాన్ని కోడు మూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 28: నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల తైక్వాండో పోటీలను ఏపీ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ప్రారంభించారు. 1985లో కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 29న హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజును ప్రపంచ క్రీడా దినోత్సవంగా ప్రకటించిందని ఆయన తెలిపారు. చిన్నారులకు పోటీలను నిర్వహించడం ద్వారా వారిలో ఉన్న ప్రతిభ బహిర్గతమవుతుందన్నారు. నైపుణ్యాలను పెంపొందించుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హాకీ ప్రధాన కార్యదర్శి దాసరి సుధీర్, తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, సాయి తైక్వాండో దీపక్ కుమార్ పాల్గొన్నారు.

వచ్చింది తక్కువ.. నమోదు ఎక్కువ

- చొక్కనహల్లి ప్రాథమిక పాఠశాలలో ఎక్కువ హాజరు చూపుతున్న నిర్వాహకులు



బుధవారం పాఠశాలకు హాజరైన విద్యార్థులు

ఆస్పరి, ఆగస్టు 28: విద్యార్థుల చదువును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ పథకం అక్రమార్కులకు మేతగా మారింది. విద్యార్థులు కొందరే ఉన్నా, అధికంగా హాజరు నమోదు చేసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని చొక్కనహల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాలలో విద్యార్థులు 13 మంది మాత్రమే ఉండగా, రికార్డులలో మాత్రం 35గా నమోదు చేశారు.

పట్టించుకోని ఎంఈవో

మధ్యాహ్న భోజన పథకం అమలు ఎంఈవో పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. హెచ్‌ఎంలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అక్రమాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

స.హ. చట్టం ద్వారా తెలుసుకోండి: ఎంఈవో

ఎంఈవో తిరుమలరావునుపై వివరణ కోరగా పాఠశాలల వివరాలు కావాల్సి వస్తే సమాచార హక్కు చట్టం ద్వారా పొందాలని తెలిపారు. విద్యార్థులు ఇంటికి వెళుతున్నారని హెచ్‌ఎం తెలిపారని, పాఠశాల వద్ద విచారించుకోమని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

మా భూములు ఆక్రమించారు

- న్యాయం చేయండి.. జేసీకి బాధితుల ఫిర్యాదు



జేసీకి వినతి పత్రం ఇస్తున్న బాధితులు

మంత్రాలయం, ఆగస్టు 28: తమ భూమిని ఫ్యాక్టరీ యజమానులు ఆక్రమించారని న్యాయం చేయాలని బాధితులు బుధవారం కర్నూలులో జేసీ నవ్యకు ఫిర్యాదు చేశారు. బాదితుడు గొల్ల ముత్తన్న, తల్లి మాట్లాడుతూ మాధవరం గ్రామ సర్వే నెం. 154 లోని 6.40 ఎకరాల భూమిని స్థానిక ఫ్యాక్టరీ యజమానులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి గొల్ల రామాంజనేయులు పేరు మీద ఉన్న భూమిని నాయనమ్మ గొల్ల తాయమ్మ పేరు మీద రెవెన్యూ రికార్డులో ఎక్కించి, అనంతరం ఆమె నుంచి రిజిస్ట్రేషన్ చేసి చేశారని అన్నారు. తన తండ్రి పేరుమీద ఉన్న భూమి తమకే హక్కు ఉందని, భూమి తమ సాగులోనే ఉందని, తమకు న్యాయం చేయాలని జేసీకి విన్నవించారు.

దోషులను కాపాడిన వారిని విచారించాలి

ఆదోని టౌన్, ఆగస్టు 28: ఓ సినీ నటిపై అత్యాచారం చేసిన నిందితులను కాపాడిన సజ్జల, మాజీ సీఎం జగన్‌ను విచారించాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహమ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం మాట్లాడుతూ, గత ప్రభుత్వ అరాచకాలపై దర్యాప్తు చేయాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కేజీబీవీ ప్రిన్సిపాల్ శాంతి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 28 : పట్టణంలోని కేజీబీవీ విద్యార్థినులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీలలో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ శాంతి బుధవారం తెలిపారు. రేణిగుంటలో జరిగిన రాష్ట్ర రెజ్లింగ్ పోటీలలో అనూరాధ, అఖిల, మౌనిక మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారన్నారు. అక్షయ, యు. అఖిల ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పథకాన్ని సాధించారన్నారు. శైలజ, అక్షయ గౌతమి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పథకాన్ని అందుకున్నట్లు తెలిపారు. పీఈటీ నిసునందను అభినందించారు.

నేడు కూరగాయల మార్కెట్ వేలం

ఆస్పరి, ఆగస్టు 28 : గ్రామ పంచాయతీ టమోటా కూరగాయల మార్కెట్ వేలం గురువారం నిర్వహిచనున్నట్లు గ్రామ కార్యదర్శి జమ్లా నాయక్ బుధవారం తెలిపారు. గుత్తేదారులు రూ.50 వేల డిపాజిట్‌తో పాటు రూ.2లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్ పొంది ఉండాలని ఆయన తెలిపారు.

క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

ఆలూరు, ఆగస్టు 28 : తాలూక యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మొలగవల్లికి చెందిన పాస్టర్ మారెన్న సాయి పోగుల, కార్యదర్శగా బన్నూర్ శ్యాంబాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జెనోహర్, సహాయ కార్యదర్శిగా విజయ్ కుమార్ గోస, కోశాధికారిగా తుప్పడ ఏసన్న, కార్యవర్గ సభ్యులుగా రాజేష్, అమరేష్‌ను ఎన్నుకున్నారు.

హైడ్రా తరహా సంస్థను ఏర్పాటు చేయాలి

ఆదోని టౌన్, ఆగస్టు 28: ప్రభుత్వ భూములను కబ్జానుంచి కాపాడటానికి తెలంగాణకు చెందిన హైడ్రా తరహా సంస్థను ఏర్పాటు చేయాలని విరాట్ హిందూస్తాన్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజినేయులు డిమాండ్ చేశారు. బుధవారం మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయ భూములు సగానికిపైగా అన్యాక్రాంతమయ్యాయని వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

దేవనకొండ, ఆగస్టు 28: నేలతలమర్రి గ్రామానికి చెందిన చంద్ర(44) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. వివరాల మేరకు.. ఇంటిలోని పొట్టేళ్లపై దాడిచేస్తుందని కుక్కను తరుముతుండగా గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు కోడుమూరుకు తరలించారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు తెలిపారు మృతునికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సర్దుబాటు అసంబద్ధతలను తొలగించాలి



పురపాలక పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 28: ఉన్నత ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పని సర్దుబాటు అసంబద్ధతలను తొలగించాలని ఎంటీఎఫ్ పట్టణ నాయకులు కోటన్న బడుగు బసవరాజు డిమాండ్ చేశారు. బుధవారం జేఏసీ పిలుపుమేరకు భోజన విరామంలో నిరసన తెలిపారు. జీవోలు 84, 117లను రద్దుచేయాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. చంద్రమౌళి, దస్తగిరి, ఆనంద్, జంగం బసవరాజు, మద్దయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

నాణ్యమైన కోడిగుడ్లు ఇవ్వాలి

గోనెగండ్ల, ఆగస్టు 28: విద్యార్థులకు నాణ్యమైన కోడిగుడ్లను ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు పవన్ డిమాండ్ చేశారు. బుధవారం చిన్నమరివీడు ప్రాథమిక పాఠశా లలో బోజనాన్ని బియ్యం, కోడుగుడ్ల స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. గుడ్లు కుళ్లి పోయి వాసనతో ఉన్నాయని వారు తెలిపారు. చెడిపోయిన గుడ్లను విద్యార్థులకు ఇస్తే వారి ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యమైన గుడ్లు ఇవ్వకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉసేని ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కున్నూరులో కృష్ణాష్టమి



గ్రామంలో ఊరేగింపు

గోనెగండ్ల, ఆగస్టు 28: మండలంలోని కున్నూరు గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలను భక్తులు నిర్వహించారు. బుధవారం మూడ రోజు ఉత్సవాలు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కున్నూరు, కోటకొండ ఉత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భజన నిర్వహించారు. బావన్న, రామలింగ, రంగస్వామి, తిరుమలనాయుడు, పశువుల బావన, భాస్కర్, రాముడు, బాలరాజు, శివ, మనోహర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

హొళగుంద, ఆగస్టు 28: నల్లారెడ్డి, చింతలముని స్వాముల దశమి ఉత్సవాలలో బాణాసంచా పేలి గాయపడిన కర్ణాటక వాసి బడెప్ప (61) చికిత్స పొందుతూ బురుధవారం మృతిచెందారు. మండలంలోని తంగరడోన గ్రామంలో ఈనెల 15న ఉత్సవాలలో బాణాసంచా కాల్చుతూ ఉండగా నిప్పు రవ్వ బాణసంచా పడడంతో 17 మంది కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రలకు చెందిన 17 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఐదు రోజుల క్రితం గోవిందమ్మ, పద్మ, మృతి చెందగా ప్రస్తుతం బడప్ప కూడా మృతి చెందాడు. గాయపడిన వారిలో ముగ్గురు మృతి చెందారు. విషాద సంఘటనతో బాధితులు, గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలతో ఎమ్మెల్యే

- అందరికీ ఆమోదయోగ్యంగా రహదారి విస్తరణ : ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



హోటల్‌లో టీ తాగుతున్న కేఈ శ్యాంబాబు

పత్తికొండ, ఆగస్టు 28: ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు బుధవారం సాయంత్రం పట్టణంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక కార్యాలయం నుంచి మసీదు మీదుగా నాలుగు స్థంబాల కూడలి చేరుకుని ఓ హోటల్‌లో టీ తాగారు. ఎమ్మె ల్యేను గమనించిన ప్రజలు తమ రహదారి విస్తరణ విషయాన్ని ప్రస్తావించారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రహదారి విస్తరణ ఎంతో అవసరమని గత ప్రభుత్వం, నాయకులు విస్తరణను రాజకీయం చేశారని అన్నారు. తాము అందరికీ ఆమోద యోగ్యంగా రహదారి విస్తరణ చేస్తామని ప్రజలు సహకారించాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మంత్రాలయం, ఆగస్టు 28: కాచాపురం గ్రామానికి చెందిన కురువ వీరనాగుడు (49) కర్నూలులో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. వివరాల మేరకు.. ఈ నెల 26న ఖగ్గల్లులో పూజకు వెళ్తుండగా.. వెనుక నుంచి బైక్ ఢీకొని తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమ్మితం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక బుదవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జయప్రదం చేయండి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 28: జాతీయ క్రీడా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పీఈటీల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరసింహరాజు, నరసింహులు కోరారు. గురువారం ఉదయం పురపాలక మైదానం నుంచి ర్యాలీ ఉంటుందని, ఎమ్మెల్యే పార్థసారధి పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

నలుగురితో ముగించారు

మద్దికెర, ఆగస్టు 28: మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీలో 18 వార్డులు సభ్యులు ఉన్నారు. బుధవారం సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన పంచాయితీ సమావేశం నిర్వహించగా నలుగురే హాజర్యాయ్యరు. కార్యదర్శి శివకుమార్, ఉప సర్పంచ్ ప్రమీలమ్మ, సలహాదారుడు ఆంజనేయులు, సభ్యులు లక్ష్మినారా యణ, జంబునాథ్‌రాయుడు, వరప్రసాద్, బాలచంద్ర పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

గోనెగండ్ల, ఆగస్టు 28: సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడి సాధ్యమని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత సూచించారు. బుధవారం పొలాలను పరిశీలించారు. ఆముదాల కు నామాల పురుగు సోకిందని ప్రొఫినోఫాస్ 2 మిలీ లీటర్లను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే కంది పంటలో ఎకరానికి 20 కిలోల యూరియాను 15 కిలోల పోటాష్ ఎరువును పైపాటుగా వేసుకోవాలని తెలిపారు. నల్లి ద్వార వ్యాపించే వెర్రి తెగులుకు డైకోఫాల్ 5మిల్లీ లీటర్లును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. వరి నారుమళ్లలో నాట్లు వేసేటప్పుడు తప్పకుండా కాలిబాటలు ఉండేటట్లు చూసుకోవాలని వీటి వల్ల గాలి, సూర్యర్శ్మి బాగా ప్రసరించి తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు. ప్రతి రైతు పాటించి అధిక దిగుబడులు పొందాలని వారు రైతులను కోరారు.

వైభవంగా ఊరేగింపు



పూజలు చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది, భక్తులు

తుగ్గలి, ఆగస్టు 28: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఊరేగింపు వైభవంగా బుధవారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి మండపాల్లో కొలువుదీరిన కృష్ణునికి ప్రత్యేక పూజలు చేసి బుధవారం సాయంత్రం అశేష భక్తజనవాహిని మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ సుధాకర్ రెడ్డి, వీఆర్వోలు ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపులో పాల్గొన్నారు. త్రైత సిద్ధాంత సభ్యులు చంద్రశేఖర్, లైన్‌మెన్ శేఖర్ పాల్గొన్నారు.

అంచలంచెలుగా ట్రాఫిక్ సమస్య పరిష్కారం : ఎమ్మెల్యే



రహదారిలోని గుంతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆదోని టౌన్, ఆగస్టు 28: పట్టణంలోజూట ట్రాఫిక్ సమస్యను అంచెలంచెలుగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే డా. పార్థసారథి అన్నారు. బుధవారం పట్టణం లోని శ్రీనివాస భవన్ సర్కిల్ నుంచి కూరగాయల మార్కెట్ వరకు అధికారులతో కలిసి పర్యటించి, ట్రాపిక్ సమస్యలను, రోడ్లపై ఉన్న గుంతలను తెలుస ుకున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు అధికంగా ఉన్నాయని తొలగించి వన్‌వేపై అధికారులతో మాట్లాడతామన్నారు. ప్రతివారం రోడ్ల పరిస్థితిపై అధికారులతో కలిసి పర్యటించి పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటానని తెలిపారు. మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ అనుపమ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, సిబ్బంది, సీఐలు పాల్గొన్నారు.

సమావేశానికి ఎమ్మెల్యేను ఆహ్వానించిన చైర్ పర్సన్

30వ తేదీన జరిగే కౌన్సిల్ సమావేశానికి హాజరుకావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వాల్మీకి శాంత కోరారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

వర్షంతో తడిసిన వేరుశనగ



వేరుశనగను బస్తాల్లో నింపుతున్న కూలీలు

ఆదోని టౌన్, ఆగస్టు 28: బుధవారం సాయంత్రం ఆదోనిలో కొద్దిపాటి వర్షం కురవడంతో మార్కెర్ యార్డులో వేరుశనగ దిగుబడులు స్వల్పంగా తడిచాయి. మేఘాలు కమ్ముకోవడం గమనించిన రైతులు ప్లాట్‌ఫాం బయట ఉంచిన వేరుశనగను దుకాణాల సమీపంలోని షెడ్ల కిందకు తీసుకొచ్చారు. అప్పటికే టెండర్ పూర్తయి తూకాలు కూడా పూర్తవడంతో రైతులకు నష్టం జరగలేదు. టార్పాళ్ళు కప్పినా కింద కొద్దిగా వేరుశనగ తడవడంతో వ్యాపారులు తడిసిన దానికి బాదులు కింద కేజీ నుంచి రెండు కేజీల వరకు రైతుల నుంచి తీసుకున్నారు.

ఆక్రమణపై ఫిర్యాదు

మద్దికెర, ఆగస్టు 28: స్థానిక జడ్పీ బాలికల పాఠశాల వద్ద పంచాయతీ స్థలాలను ఆక్రమించుకున్నారని హెచ్‌ఎం దేవేంద్రప్ప, విద్యాకమిటీ చైర్మన్ అనిత, వైస్ చైర్మన్ చంద్రహరి, కార్యదర్శి శివకుమార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు 350 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. పాఠశాల చుట్టూ దుకాణాల్లో ఆకతాయిలు చేరి విద్యార్థినులను ర్యాగింగ్ చేస్తున్నారని తెలిపారు. ఇష్టాను సారంగా బంకులు వేసుకోవడం వల్ల విద్యుత్ వల్ల ప్రమా దాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన కార్యదర్శి శివకుమార్ ఆక్రమణలను వాటిని తొలగిస్తామని హామీ ఇచ్చారు.

టీడీపీ హయాంలోనే వాల్మీకుల సంక్షేమానికి పెద్దపీట



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 28: టీడీపీ హయాంలోనే వాల్మీకులకు పెద్దపీట వేశామని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం కడివెళ్ల గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాల్మీకులు ఐక్యంగా ఉండి తమ హక్కులను శాంతియుతంగా సాధించుకోవాలని కోరారు. తాను ఎల్లవేళలా అందుబాటులో ఉండి సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం మహిళలతో మాట్లాడారు. తాగునీరు, సీసీ రోడ్ల సమస్యలను మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే తాను ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం మీకు తాగునీటి సమస్యలేకుండా చేస్తానని, సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు, ఎంపీటీసీ హనుమంతు, నరసన్న, రంగనాయకులు, గుంటెప్ప, శీను, రాజు, గోపాల్, పార్లపల్లి మల్లికార్జున, సోమేశ్వరరెడ్డి, కందనాతి కేశన్న, సురేష్ చౌదరి, డీలర్ ఈరన్న, వీరాంజనేయులు, రాముడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి చేస్తాం



గ్రామ సభలో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, ఆగస్టు 28: ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో తుగ్గలిని అభివృద్ధి చేస్తామని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి పంచాయతీ గౌరవ సలహాదారు తుగ్గలి నాగేంద్ర అన్నారు. బుధవారం తుగ్గలిలో శ్రీరాముని దేవాలయంలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామ పంచాయితీలు నిర్వీర్యమయ్యాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం రాకతో గ్రామ పంచాయితీలకు మహర్దశ వచ్చిందని నిధలు విడుదల చేసి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాని తెలిపారు. సమస్యలను తెలుసుకుని అభివృద్ధి పనుల వివరా లను ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. నిధులు మం జూరైతే ఎన్టీఆర్ కాలనీలో సీసీ రోడ్లు నిర్మిస్తామని నిధులు రానిపక్షంలో తన సొంత నిధులతో మట్టి రోడ్లు వేయిస్తామన్నారు. తాగునీటి సమస్య పరిస్కరిస్తామన్నారు. ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు. మాజీ జడ్పీటీసీ వరలక్ష్మి, సర్పంచు రవి, కార్యదర్శి రాజు నాయక్, వీఆర్వో రహిమాన్, వార్డు మెంబర్లు ఆకుల శ్రీనివాసులు, అల్లాబకాష్, మాజీ వైస్ ఎంపీపీ విజయభాస్కర్ పాల్గొన్నారు.

కర్నూలు రహదారిని బాగు చేయండి

ఆలూరు రూరల్, ఆగస్టు 28: ఆలూరు నుంచి కర్నూలు వెళ్లే రహదారిని బాగు చేయాలని టీడీపీ రైతుకమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మాట్లాడుతూ రహదారిపై గుంతలు ఉన్నాయని రాత్రి వేళల్లో ప్రయాణికులు గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరారు.

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

ఆలూరు, ఆగస్టు 28: కోర్టులు, పోలీసు స్టేషన్‌ల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ఆలూరు ఎస్ఐ వెంకటనరసింహులు సూచించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో కక్షిదారులతో సమావేశం నిర్వహిం చారు. సెప్టెంబర్ 14న నిర్వహిస్తున్న మెగాలోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

ఈ క్రాప్ నమోదుకు 15 వరకు అవకాశం

మద్దికెర, ఆగస్టు 28: ఈక్రాప్ నమోదుకు సెప్టెంబరు 15వ తేదీ వరకు అవకాశముందని ఏవో ఉప్పర రవి తెలిపారు. బుధవారం ఎరవలిలో పంట నమోదును తనిఖీ చేశారు. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయని, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వీఆర్వో వుశేనప్ప ఉన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సిద్ధం

గోనెగండ్ల, ఆగస్టు 28: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామని ఆదోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులు, ప్రజలు సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

అది ప్రభుత్వ భూమి కాదు..

ఆదోని రూరల్ ఆగస్టు 27: ఆదోని మండలం బసాపురం గ్రామానికి చెందిన సర్వేనెం.20, 21, 64 భూమి ప్రభుత్వ భూమి కాదని పట్టాభూమి అని తహసీల్దార్ శివరాముడు బుధవారం తెలిపారు. 30 సంవత్సరాలుగా దాదాపు 300 కుటుంబాలు ఉంటున్నాయని, సీఎంఓ గ్రీవెన్స్‌లో భాగంగా గ్రామంలో పరిశీలించామని అన్నారు.

రూ.2 కోట్లతో గ్రామాభివృద్ధి

చిప్పగిరి, ఆగస్టు 28: మండలంలో రూ.2 కోట్లతో గ్రామాభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎంపీపీ జూటూరు హేమలత తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో సభ్య సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్ ఏఎవో శ్రీనివాసులు, మండల విద్యాధికారి సావిత్ర, ఏవో జయలక్ష్మి, వైద్యాధికారి పార్వతమ్మ, ఏఈలు చోలా రెడ్డి, కావ్య, ఉలిగప్ప, ఏపీవో మాధవ్ శంకర్, నాగార్జున పాల్గొన్నారు.

రహదారులకు ప్రతిపాదనలు

దేవనకొండ, ఆగస్టు 28: మండలంలో రహదారుల నిర్మాణానికి రూ.43.78 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు పీఆర్ ఇన్‌చార్జి ఎఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మిదేవమ్మ అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో గౌరీదేవి, ఏవో సురేష్‌బాబు, ఎంఈవో తిమ్మారెడి, విజయ నిర్మలదేవి, హౌసింగ్ ఎఈ ఆదినారాయణ, డీటీ వెంకటేష్ ఉన్నారు.

సాగు నీరు ఇవ్వాలి

దేవనకొండ, ఆగస్టు 28: మండలంలోని పొలాలకు హంద్రీనీవా కాలువ ద్వారా సాగునీరు ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ లక్ష్మీదేవమ్మ ,ఎంపీడీవో గౌరీదేవికి రైతుసంఘం లో నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. సూరి, మహబుబ్‌భాష, యూసుప్ బాషా, బజారి, సుధాకర్, మార్కేండేయులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ బాలికల వసతి గృహాలు, మోడల్ స్కూల్ ఏర్పాటు చేసేలా చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. శరత్, మధు, భాస్కర్, ఉమేష్, సురేంద్ర ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ ఆగస్టు 28 : బైక్‌పై కర్ణాటక మద్యంను తరలిస్తున్న వ్యక్తిని పెద్దతుంబళం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల మేరకు.. సమాచారం అందడంతో కోసిగికి చెందిన బోయ నాగరాజును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ మహేష్ తెలిపారు.

సారా స్వాధీనం.. అదుపులో నిందితుడు

మంత్రాలయం, ఆగస్టు 28: మండలంలోని మాధవరం తండాకు చెందిన ఉశేన్ నాయక్ సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు మంత్రాలయం ఎస్ఐ పరమేశ్ నాయక్ తెలిపారు. బుధవారం రహస్య సమాచారం మేరకు చెట్నహళ్లి వద్ద వస్తున్న ఉశేన్ నాయక్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 3 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేశామన్నారు. అనంతరం నిందితుడిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయం చేసే వరకు పోరాటం

కోసిగి, ఆగస్టు 28: ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని పార్వతి కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాటం ఆగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.వీరేష్ అన్నారు. బుధవారం కోసిగిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కేజీబీవీ విద్యార్థినులతో కలిసి ధర్నా నిర్వహించారు. కేసును పక్కదోవ పట్టిస్తున్న అధికారులపై కలెక్టర్, ఎస్పీ చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విజయ్, బడేసాబ్, అల్లప్ప, ఉశేనీ, కృష్ణ, మునిస్వామి, కాశీం పాల్గొన్నారు.